VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 01 జూన్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 316



**చార్‌ధామ్ యాత్రకు భారీగా భక్తుల రాక**

**గత 30 రోజుల్లో 16 లక్షల మంది భక్తుల సందర్శన**

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## ఎస్సీ,ఎస్టీల సంక్షేమానికి

# కట్టుబడి ఉన్నాం

### ఆయా వర్గాలకు రాజకీయ అధికారం కృషి: భట్టి

భద్రాచలం: ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయా వర్గాలకు రాజకీయ అధికారం కల్పించేందుకు చిత్తశుద్ధితో ఉన్నామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని రకాల వనరులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ లక్ష్యమన్నారు.

వెనుకబడిన వర్గాలను దృష్టిలో పెట్టు-కునే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూగరిష్ఠ పరిమితి చట్టం చేసింది. భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూములు పంపిణీ చేసింది. 6.70 లక్షల ఎకరాలను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. పేదలకు పంచిన భూములను వారు దున్నుకోకుండా భారాస ప్రభుత్వం అడ్డుకుంది. గిరిజనుల భూమికి సాగునీటి కోసం 'ఇందిరా సౌర గిరిజల వికాసం' పథకాన్ని ప్రారంభించాం. దీనికోసం రూ.12,500 కోట్లు- కేటాయించాం. 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్ ఎ÷-లాన్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని భట్టి విక్రమార్క వివరించారు.




# మిస్ వరల్డ్‌గా థాయియా సుందరి



ప్రపంచ సుందరి 'సుచాత' మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత సొంతం చేసుకున్నారు. మొదటి రన్నరప్‌గా ఇథియోపియా భామ హాసెట్ డెరెజే, రెండో రన్నరప్‌గా మిస్ పోలండ్ మయా క్లైడా, మూడో రన్నరప్‌గా మార్టినిక్ భామ ఆరేలి జోచిమ్ నిలిచారు.

## రాష్ట్రంలో గోశాలల ఏర్పాటుకు కమిటీ





# జూన్ 10న భారత్ బంద్

**హైదరాబాద్, మే 31:**

**జూన్ 11 నుంచి ఆగస్టు 3 వరకు స్మారక సభలు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ విడుదల.**

కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఎన్కౌంటర్ లకు నిరసనగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ జూన్ 10న భారత్ బంద్ కు పిలుపునిచ్చింది. ఇటీవల తెలంగాణ, ఛత్తీస్గఢ్ సరిహద్దు జిల్లాల్లో జరిగిన ఎన్కౌంటర్ లో పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు తో సహా మొత్తం17 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే జూన్ 10 న భారత్ బంద్, అదేవిధంగా జూన్ 11 నుండ్ ఆగస్టు 3 వరకు అమర వీయల స్మారక సభలు నిర్వహించ సున్నట్లుగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట శనివారం లేఖా విడుదల చేశారు.

గత రెండు నెలలుగా సంయమనం పాటించాం, 2024 నుంచి ఇప్పటి 540 మంది మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతి చెందారని పేర్కొన్నారు. మావోయిస్టు రహిత భారత్ ఏర్పాటు కోసం 2026 మార్చి వరకు హత్యకాండను కొనసాగిస్తామని ప్రధాని మోడీ, హెూం మంత్రి అమిత్ షా?

ప్రకటించడం దారుణమన్నారు.

తాము చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం బలగాలను దించి నియంతృత్వంగా వ్యవహరిస్తుందని అన్నారు. శాంతి చర్చలకు సిద్ధంగా లేని బీజేపీ పాలనాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫాసిస్టు వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన, విశాలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు.

## కెసిఆర్ మీద ఈగవాలినా

# ఊరుకునేది లేదు

- కెసిఆర్‌కు జాగృతి, బిఆర్ఎస్ రెండు కళ్లు
- నోటీసులపై 4న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా
- బనకచర్ల ద్వారా గోదావరి జలాల దోపిడీ
- ఎపికి అనుకూలంగా రేవంత్ మౌనం
- తెలంగాణ ప్రజల గొంతుకగా తెలంగాణ జాగృతి సంస్థ
- నూతన కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్సీ కవిత

సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలి. అమరవీరులకు నివాళులు అర్పించాలి. కనీసం రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా రేవంత్‌రెడ్డి.. 'జై తెలంగాణ' అనాలని డిమాండ్ చేశారు. జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారు. రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం.


**జాగృతి సంస్థను ప్రారంభించి 18ఏళ్లు అయిందని, ఇప్పటి వరకు అశోక్‌నగర్‌లో జాగృతి కార్యాలయం ఉండేది.. ఇప్పుడు బంజారాహిల్స్‌కు మార్చామని, ఇకపై ఇక్కడి నుంచే సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తామని అన్నారు. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎందరో ఆశీస్సులు అందించారు.**



## పహల్గాం ఉగ్రదాడికి దీటుగా

# జవాబిచ్చాం

- నారీశక్తి ఏమిటో పాక్‌కు చాటి చెప్పాం
- ఆపరేషన్ సిందూర్‌తో గట్టిగా బుద్ధి చెప్పాం
- భోపాల్ పర్యటనలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మోడీ



మన సంప్రదాయంలో 'సిందూర్'.. 'నారీశక్తి'కి చిహ్నం. పహల్గాంలో, ఉగ్రవాదులు కేవలం మన పౌరుల రక్తం మాత్రమే కళ్ల చూడలేదు. మన సంస్కృతిపై దాడి చేశారు. మన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నించారు. ఉగ్రవాదులు భారత నారీశక్తికి విసిరిన సవాలే

## కాళేశ్వరంపై అబద్ధాలు

# కట్టిపెట్టండి

రంగనాయక సాగర్‌కు నీళ్లు ఎక్కడివి

మంత్రి ఉత్తమ్ తదితరులపై హరీష్ రావు మండిపాటు



## రఫేల్ కూలిందా లేదా చెప్పాలి



న్యూఢిల్లీ: చైనా ,పాకిస్థాన్‌తో ముప్పు నేపథ్యంలో భారత్ భద్రతను పటిష్టం చేయాలని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత ఎయిర్‌ఫోర్స్ విజయాలపై తాము గర్విస్తున్నామని కొనియాడారు. మన సైనికులు అద్భుతమైన ఆపరేషన్ నిర్వహించారని, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారని ప్రశంసించారు. శనివారం ఢిల్లీ వేదికగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. యుద్ధంలో రాఫెల్ యుద్ధ విమానాలు కూలిపోయాయా.. అనే ప్రశ్నకు భారత విదేశాంగ శాఖ మంత్రి సరైన సమాధానం చెప్పలేదని అన్నారు. ఆపరేషన్‌లో రాఫెల్ యుద్ధ విమానం కూలిపోయిందని సీడీఎస్ అనిల్ చౌహన్ మాత్రం స్పష్టం చేశారని తెలిపారు. భారత ప్రభుత్వం ఇకనైనా దీన్ని నిరాకరించడం మానుకోవాలని.. ఇదే విషయాన్ని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మొదటి నుంచి అడుగుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కాల్పుల విరమణ గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎలా ట్వీట్ చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఫైటర్ విమానాలు, ఆయుధాలను అందించడంలో ఆలస్యం అవుతుందని ఎయిర్ చీఫ్ మార్షల్ చెప్పడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. బూమ్‌బర్గ్ ఛానెల్‌లో భారత సీడీఎస్ ఈ విషయాన్ని వెల్లడించారని గుర్తుచేశారు. 42 ఫైటర్ విమానాలు మంజూరైతే... మన వద్ద కేవలం 31 యుద్ధ విమానాలు మాత్రమే ఉన్నాయని చెప్పుకొచ్చారు. తేలికపాటి యుద్ధ విమానాలను సప్లై చేయడంలో హెచ్ఏఎల్ ఆలస్యం చేస్తోందని.. అత్యవసరంగా ఈ సమస్యను పరిష్కరించాలని అన్నా రు.

## దిగ్గజ కార్పోరేట్ సంస్థల్లో

# తెలంగాణ బిడ్డల సేవలు

- తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే మా అభిమతం
- ఇండియా ఫస్ట్, తెలంగాణ ఫస్ట్ అన్నదే మావిధానం

ఇంగ్లాండ్ వార్విక్ యూనివర్సిటీ కార్యక్రమంలో కెటిఆర్



వేగుచుక్క

# కాళేశ్వరంపై అబద్ధాలు కట్టిపెట్టండి

సిద్దిపేట: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తమ్‌కి జ్ఞానం ఉందో లేదో తెలియదని విమర్శించారు. కాళేశ్వరంతో ఒక ఎకరం పారలేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారని.. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైన రంగనాయక సాగర్ నుంచి ఇక్కడ పొలాలకు నీళ్లు వచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్ గ్రామంలోని గంగమ్మ దేవాలయ అమ్మవారి వార్షికోత్సవంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ ప్రాజెక్ట్‌తో ఎలాంటి ఉపయోగం లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని... మరి రాఘవాపూర్ చెరువులో నీళ్లు ఎక్కడివని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి అన్ని విషయాలు ప్రజలకు తెలుసునని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌తో ఉపయోగం లేదని అన్నోళ్లకి ఈ ఏడాది పండిన పంట తెలియదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం జలాలతో చెరువులు మత్తళ్లు పారుతున్నాయని తెలిపారు. గతంలో అన్నదాతలు ఒకరిని చూసి మరొకరు మిత్తికి పైసలు తెచ్చి పంటలు సాగు చేసేవారని చెప్పుకొచ్చారు. రేవంత్ ప్రభుత్వ తప్పిదాలతో రైతులు ఏడాదంతా ఇబ్బంది పడుతున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ కాకతీయతో చెరువులు బాగు చేసుకుని, కాళేశ్వరం ప్రాజెక్టుతో అనుసంధానం చేసుకున్నాం. కాలమైనా, కాకపోయినా కాళేశ్వరం నీళ్లతో రెండు పంటలు పండించుకుంటున్నాం. కొంతమంది మూర్ఖులు హైదరాబాద్‌లో కూర్చుని ఏం తెలియకుండా మాట్లాడుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ బతుకుదెరువు చూపించారు. రేవంత్ ప్రభుత్వం బతుకుదెరువును ఆగం చేసింది. ఈ రోజు కేసీఆర్ లేని లోటు- ప్రజలు గమనిస్తున్నారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్ రావాలని, మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటు-న్నారు. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతుంది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలకు ఏమైనా ప్రయోజనం ఉందా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# మావోయిస్టులపై వేట.. నంబాల ఎన్‌కౌంటర్

రాయ్‌పూర్: వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యమని కేంద్రం పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించింది. ఇది గతేడాది నుంచి ఆపరేషన్ ఊపందుకుంది. మావోయిస్టు కీలక నేతలను భద్రతా దళాలు మట్టుబెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టుల నుంచి ఓ లేఖ బయటకు వచ్చింది. ఆ లేఖలో మావోయిస్టు కేంద్ర కమిటీ జూన్ 10న భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు- పేర్కొన్నారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు రాసుకొచ్చారు.. మావోయిస్టు కేంద్ర కమిటీ అభయ పేరుతో లేఖ విడుదల చేశారు. ఛత్తీస్‌ఘడ్‌లోని అబూజ్‌మడ్ అడవులు ఇన్నాళ్లు మావోయిస్టులకు కీలక స్థావరాలుగా ఉన్నాయి. కానీ అక్కడికి కూడా భద్రతా బలగాలు చొచ్చుకెళ్తున్నాయి. దట్టమైన అడవుల్లో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ.. భద్రతా బలగాలు ముందుకెళ్తున్నాయి. ఫలితంగా తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో మావోయిస్టులు చనిపోతున్నారు. జవాన్లూ వీరమరణం పొందుతున్నారు. కాగా.. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మే 21న మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు- పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ. 1.5కోట్లు- రివార్డు ఉందని తెలిపారు.

## టెన్త్ పరీక్షల నిర్వహణలో చంద్రబాబు,లోకేష్ పెయిల్

అమరావతి: టెన్త్ పరీక్షల నిర్వహణలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ పూర్తిగా ఫెయిల్ అయ్యారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. మీ పాలనలో విద్యారంగం భ్రష్టు పట్టిపోయిందని పేర్కొన్నారు. మీ అవివేక, అనాలోచిత, పరిణితిలేని నిర్ణయాలతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలే ఎదురవుతున్నాయని అన్నారు. 10వ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేని దుస్థితిలో ఉన్నారని తీవ్రంగా విమర్శించారు.. మీరు మిగతా వ్యవస్థలను ఇంకా ఎంత ఘోరంగా నడుపుతున్నారో అర్థం అవుతోందని స్పష్టం చేశారు. 6.14 లక్షల మంది రాత్రీపగలూ కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడించలేక పోయారని దుయ్యబట్టారు.. మీరు ఘోరంగా విఫలమై విద్యార్థులను, వారి తల్లిదండ్రులను క్షోభకు గురిచేశారని మండిపడ్డారు. ప్రతి స్టూడెంట్ కూడా తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తం చేసే పరిస్థితిని తీసుకు వచ్చారని.. మీరు చేసిన తప్పులు కారణంగా ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా అడ్మిషన్లలో విద్యార్థులు అన్యాయమైపోయిన ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పోస్ట్ చేశారు..

'చంద్రబాబు గారూ దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అసలు పరీక్షల నిర్వహణ సమయంలోనే మీ బేలతనం బయటపడింది. ప్రశ్నపత్రాలు లీకేజీ అయ్యాయి. అయినాసరే తప్పులను సరిదిద్దుకోకపోవడం మీ అసమర్థతకు నిదర్శనం కాదా? రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి ప్రపంచస్థాయిలో పోటీ-ని ఎదుర్కొనేలా తీసుకొచ్చిన అనేక సంస్కరణలను వచ్చీరాగానే దెబ్బతీశారు. స్కూళ్లలో నాడు-నేడు, గోరుముద్ద, ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకూ ప్రయాణం, 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు, 3వ తరగతి నుంచే సబ్జెక్టుల వారీగా బోధన ఇలా ప్రతి మంచి కార్యక్రమాన్ని కక్షగట్టి నీరుగార్చారు. తల్లులను ప్రోత్సహిస్తూ ఇచ్చే అమ్మ ఒడిని రద్దుచేశారు. పరీక్షలు నిర్వహణ, ఫలితాల వెల్లడిలోనూ విఫలమవుతున్నారు. మీరు చేసిన తప్పుల వల్ల విద్యార్థులు బలైపోవడానికి వీల్లేదు. ఎలాంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయండి. తుది ఫలితాలు వచ్చేంతవరకూ -టె-న్త్ మార్కు ప్రాతిపదికగా చేస్తున్న అడ్మిషన్లను కొన్నిరోజులపాటు- నిలిపివేయండి. తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మొదలు అందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నానని జగన్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## దిగ్గజ కార్పోరేట్ సంస్థల్లో తెలంగాణ బిడ్డల సేవలు



హైదరాబాద్: దిగ్గజ కార్పోరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలు అందించడం మనందరికీ గర్వకారణం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతం అన్న కేటీఆర్, ఇండియా ఫస్ట్, తెలంగాణ ఫస్ట్ అన్నదే తన విధానం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు భారీగా ఉపాధి అవకాశాలు దొరకాలన్నారు. అందుకోసం తమ సర్వశక్తులు ఉపయోగిస్తామన్నారు. ఇంగ్లాండ్ వార్విక్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పిడిఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. తెలంగాణ విజయాల గురించి మాట్లాడటానికి ఎల్లప్పుడూ తనకు గర్వంగా ఉంటుందన్నారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆటోమొబైల్ రంగంలో పిడిఎస్ఎల్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉ÷ూర తమ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించాలని కోరిన కేటీ-ఆర్, ఇంగ్లాండ్‌లో యూనివర్సిటీ-, ఇండస్ట్రీల మధ్య ఉన్న పరస్పర సహకారం తనను ఆశ్చర్యపరిచిందన్నారు. మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీలకు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సేవలను అందించే పీడీఎస్ఎల్ సంస్థ, వార్విక్ యూనివర్సిటీ-లో తన నాలెడ్జ్ సెంటర్ ప్రారంభించుకోవడం తెలంగాణ టాలెంట్‌కు నిదర్శనం అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ వినూత్న విధానాలతోనే ఆటోమోటివ్ హబ్‌గా పూణే, చెన్నైల సరసన హైదరాబాద్ నిలిచిందన్నారు. తమ ప్రభుత్వ కాలంలోనే ఐటీ, లైఫ్ సైన్సెస్‌తో పాటు- ఆటోమోటివ్ రంగంలోనూ తెలంగాణ సత్తా చాటిందన్నారు. ఆటోమోటివ్ రంగంలో కేవలం రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కే పరిమితం కాకుండా తయారీ రంగంలో కూడా తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపేందుకు తమ ప్రభుత్వం తీసుకువచ్చిన పాలసీలు ఉపయోగపడతాయన్నారు. భారతదేశంలో ఫార్ములా ఈ రేసింగ్ ఛాంపియన్‌షిప్ ను నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అన్న కేటీఆర్, పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు- రాష్ట్రంలో మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేసిందన్నారు. తమ ప్రభుత్వ నిరంతర కృషితో అంతర్జాతీయ కంపెనీలకు కొత్త చిరునామాగా తెలంగాణ మారిందన్నారు. గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి కార్పోరేట్ దిగ్గజాలు తమ అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్‌లో ప్రారంభించాయని గుర్తుచేశారు. తమ తొమ్మిదేండ్ల కాలంలో ఐటీ- ఉద్యోగాలు, ఎగుమతులతో పాటు- ఇతర రంగాల్లోనూ తెలంగాణ అద్భుతంగా పురోగతి సాధించిందన్నారు. ఐటీ-, దాని అనుబంధ రంగాలతో పాటు- ఆటోమొబైల్ వంటి ఇతర రంగాల్లోనూ మనదేశ యువత తమ ప్రతిభ, నిబద్ధతతో అద్భుతంగా రాణిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత, విద్యార్థులతో పాటు- కంపెనీలు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు.

పిడిఎస్ఎల్ డైరెక్టర్ క్రాంతి పుప్పాల మాట్లాడుతూ.. కేటీ-ఆర్ ఆలోచనలు, పనితీరు కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితం కాలేదన్నారు. ఆయన చేసిన పనులు, తీసుకొచ్చిన విధానాలు ముఖ్యంగా ఇన్నోవేషన్ రంగానికి చేసిన కృషితో ఐటీ- ఒక్కటే కాదు అనేక రంగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా నిలబడిందన్నారు. అనేక దిగ్గజ కంపెనీలను హైదరాబాద్‌కు రప్పించి తన పనితీరు ఆలోచనా థృక్పథంతో గ్లోబల్ లీడర్‌గా ఎదిగిన కేటీ-ఆర్ చేతుల మీదుగా తమ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించుకోవడం తమ కంపెనీకి అత్యంత గౌరవం అన్నారు. లెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడ జరిగే కార్యకలాపాలను కేటీ-ఆర్ పరిశీలించారు. తమ సంస్థ గురించి పిడిఎస్ఎల్ ప్రతినిధులు ఆయనకు వివరించారు. ఆ తరువాత కంపెనీ సిబ్బంది,ఉద్యోగులతో కేటీఆర్ ఇంటరాక్ట్ అయ్యారు.

# పహల్గాం ఉగ్రదాడికి దీటుగా జవాబిచ్చాం



భోపాల్:పహల్గాంలో దాడికి పాల్పడి.. భారత నారీశక్తికి సవాల్ విసిరి.. ఉగ్రవాదులు వారి వినాశనాన్ని వారే కొనితెచ్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదులే కాదు.. వారిని పోషించేవారు కూడా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ ప్రపంచానికి చాటి చెప్పిందని ప్రధాని పేర్కొన్నారు. మహిళల సిందూర్ తుడిచేస్తే ఏం జరుగుతుందో చేసి చూపామని అన్నారు. ఉగ్రదాడికి ప్రతీకారంగా..'ఆపరేషన్ సిందూర్' లో పలువురు మహిళా అధికారిణులు పాల్గొని ఉగ్రవాదుల ఆచూకీ గల్లంతు చేశారని కీర్తించారు. రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా భోపాల్‌లో నిర్వహించిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో పాల్గొన్న ప్రధాని మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో భారత కుమార్తెల బలాన్ని ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై పాక్ దాడులు చేసినప్పుడు అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలోని మహిళా బీఎస్ఎఫ్ (ఇ÷ూఎ) బృందం మూడు రోజుల పాటు- అఖ్నూర్‌లోని తమ ఫార్వర్డ్ పోస్టులపై పోరాడారని కీర్తించారు. మన సంప్రదాయంలో 'సిందూర్'.. 'నారీశక్తి'కి చిహ్నం. పహల్గాంలో, ఉగ్రవాదులు కేవలం మన పౌరుల రక్తం మాత్రమే కళ్ల చూడలేదు. మన సంస్కృతిపై దాడి చేశారు. మన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నించారు. ఉగ్రవాదులు భారత నారీశక్తికి విసిరిన సవాలే వారి పాలిట, వారిని పోషిస్తున్న వారి పాలిట శాపంగా మారింది. పాకిస్థాన్ సైన్యం కూడా ఊహించని ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాలపై మన సాయుధ దళాలు దాడులు చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం చేపట్టిన ఈ ఆపరేషన్ భారత చరిత్రలోనే అతిపెద్ద విజయమని ప్రధాని వ్యాఖ్యానించారు.

భోపాల్‌లో నిర్వహించిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో పాల్గొన్న ప్రధాని మోదీ ఇందౌర్ మెట్రో, దాటియా, సత్నా విమానాశ్రయాల సూపర్ ప్రియారిటీ-కారిడార్లను వర్చువల్‌గా ప్రారంభించారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రూ.483 కోట్లతో నిర్మించిన కొత్త అటల్ గ్రామ సేవా సదన్ (పంచాయత్ భవన్)లకు ఇవ్వాల్సిన మొదటివిడత మొత్తాన్ని మోదీ బదిలీ చేశారు. 18వ శతాబ్దానికి చెందిన మాల్వాలోని హోల్కర్ రాజవంశానికి చెందిన రాణి అహల్యాబాయి అసాధారణ పాలన, సామాజిక సంక్షేమంపై నిబద్ధతను కొనియాడారు. రాణి అహల్యాబాయికి అంకితం చేసిన పోస్టల్ స్టాంప్, రూ.300 స్మారక నాణాన్ని ప్రధాని విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపన చేశారు.మధ్యప్రదేశ్‌లో తొలి మెట్రో రైలు సర్వీస్ ఇండోర్ మెట్రోను కూడా ఆయన ప్రారంభించారు. ఇందులో 28 స్టేషన్లు ఉన్నాయి. రూ.7,500 కోట్లతో ఈ ప్రాజెక్టుకు ఖర్చవుతుందని అంచనా. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులన్నీ మధ్యప్రదేశ్‌లో సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. అభివృద్ధిని వేగవంతం చేస్తాయి. కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని అన్నారు.

# కెసిఆర్ మీద ఈగవాలినా ఊరుకునేది లేదు



హైదరాబాద్: కెసిఆర్ మీద ఈగవాలినా ఊరుకునేది లేదని భారాస ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరించారు. తెలంగాణ ప్రజల గొంతుకగా తెలంగాణ జాగృతి సంస్థ పనిచేసిందని కవిత అన్నారు. కెసిఆర్‌కు జాగృతి, బిఆర్ఎస్ రెండు కళ్లని అన్నారు. కాళేశ్వరం కమిషన్ నోటీసులపై జూన్ 4న పెద్ద ఎత్తున ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తామని ప్రకటించారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన 'తెలంగాణ జాగృతి' నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో జాగృతి సంస్థ ఏర్పడిందన్నారు. తెలంగాణ తెచ్చినందుకా లేక తెలంగాణ కోసం పనిచేసినందుకా కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. అది కాళేశ్వరం కమిషన్ కాదని, కాంగ్రెస్ కమిషన్ అంటూ విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కెసిఆర్‌పై ఈగవాలినా సహించబోమని హెచ్చరించారు. జాగృతి సంస్థను ప్రారంభించి 18ఏళ్లు అయిందని, ఇప్పటి వరకు అశోక్‌నగర్‌లో జాగృతి కార్యాలయం ఉండేది.. ఇప్పుడు బంజారాహిల్స్‌కు మార్చామని, ఇకపై ఇక్కడి నుంచే సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తామని అన్నారు. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎందరో ఆశీస్సులు అందించారు. మేము చేసిన ఉద్యమాల వల్ల చాలా జీవోలు వచ్చాయి. గత పదేళ్ల కేసీఆర్ పాలనకు.. ఇప్పటి కాంగ్రెస్ పాలనకు ఎంతో తేడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలి. అమరవీరులకు నివాళులు అర్పించాలి. కనీసం రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా రేవంత్‌రెడ్డి.. 'జై తెలంగాణ' అనాలని డిమాండ్ చేశారు. జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారు. రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం. తెలంగాణ యువ వికాసం అని ఉండాలి కానీ, రాజీవ్ యువ వికాసం అని ఉండకూడదన్నారు. కేసీఆర్‌కు రెండు కళ్లలా పనిచేస్తాం.. ఒక కన్ను భారాస అయితే, రెండోది జాగృతి సంస్థ. కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోం. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. యావత్ తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్టే. ఈ రాష్ట్రానికి ఆయన ఏం చేశారో ప్రజలందరికీ తెలుసు తెలంగాణ తెచ్చిన వ్యక్తికి నోటీసులు ఇస్తారా? అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అంటూ నిప్పులు చెరిగారు. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. మహాధర్నాలో నోటీసుల కుట్ర మొత్తం వివరిస్తాం. గోదావరి-కావేరీ లింకేజీతో నదీ జలాలు తెలంగాణకు శాశ్వతంగా దూరమవుతాయి. బనకచర్ల ద్వారా ఏపీ ప్రభుత్వం నీళ్లు తీసుకుపోతుంటే రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు? నదుల అనుసంధానాన్ని కేసీఆర్ వ్యతిరేకించారు. తుపాకుల గూడెం వద్ద రివర్ లింకేజీ ఉండాలని ఆయన సూచించారు. ఇచ్చంపల్లి వద్ద రివర్ లింకేజీ పెడతామని కేంద్రం చెప్పింది. జూన్ 2న నదీ జలాలపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి. అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టాలని డిమాండ్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్, కేసీఆర్ ఫొటోలతో తెలంగాణ జాగృతి బ్యానర్ పెట్టారు. కొత్త కార్యాలయంలో బీఆర్ అంబేద్కర్, ఆచార్య జయశంకర్, తెలంగాణ తల్లి, జ్యోతిబా ఫులే, సావిత్రిబాయి ఫులే విగ్రహాలతో పాటు- అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు-చేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవం నాడు అమరవీరులకు రేవంత్ నివాళులర్పించాలి. నివాళులర్పించని వారికి కుర్చీలో కూర్చునే అర్హత లేదు. ఉద్యమకారులపైకి గన్ తీసుకెళ్లిన వాళ్లు.. ప్రస్తుతం రాష్ట్రానికి సీఎం అయ్యారు. తెలంగాణ పథకాలకు తెలంగాణ వారి పేర్లే పెట్టాలి. తెలంగాణ యువ వికాసం అని ఉండాలి.. రాజీవ్ యువవికాసం అని కాదు. వేరే రాష్ట్రం తెలంగాణ నీళ్లు తీసుకెళ్తుంటే మాట్లాడలేని పరిస్థితి రేవంత్‌ది. బనకచర్ల ప్రాజెక్ట్‌పై రేవంత్ ఎందుకు మాట్లాడటం లేదు. గోదావరి నీళ్లు శాశ్వతంగా దూరం కాబోతున్నాయి. ఏపీ ప్రయోజనాల కోసమే రేవంత్ పనిచేస్తున్నారని విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పిడికిలి బిగిస్తేనే తెలంగాణ వచ్చింది. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ.. జూన్ 4న ఇందిరాపార్క్ దగ్గర మహాధర్నా చేపడుతున్నాం. గోదావరి జలాల్లో వాటా కాపాడకపోతే.. తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుందని అన్నారు. కేంద్రం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని,లేకుంటే రైలురోకోలాంటికార్యక్రమాకలు వెనకాడమని అన్నారు.

# రాష్ట్రంలో గోశాలల ఏర్పాటుకు కమిటీ

హైదరాబాద్:రాష్ట్రంలో గోశాలల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలని, నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో శనివారం సీఎం రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గోసంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలన్నారు. గడువులోగా కమిటీ- పూర్తిస్థాయి ప్రణాళికతో ఉండాలని సిఎం ఆదేశం ఇచ్చారు. గోసంరక్షణ, నిర్వహణ సులువుగా, వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలని, అందుబాటులో ఉన్న స్థలాలు గుర్తించాలని కోరారు. కనీసం 50 ఎకరాలకు తగ్గకుండా గోశాలలు ఉండాలని సిఎం అన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు- చేయాలని సూచించారు. ఇందు కోసం అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలన్నారు. కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరుకు స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు ఏర్పాటు- చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు- చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను ఈ సంద్భంగా సీఎం పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ప్రభుత్వం ఖరారు చేయనుంది. ఈ సమీక్షా సమావేశంలో సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, హెచ్ఎం ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశు పోషణ విభాగం డైరెక్టర్ బి.గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మరోవైపు.. వేములవాడ రాజన్న ఆలయంలో కోడెలు మరణించడం తీవ్ర కలకలం రేపుతోంది.

## కోరలు చాస్తోన్న కోవిడ్ రాజధాని ఢిల్లీలో ముగ్గురు మృతి

న్యూఢిల్లీ,: దేశంలో మరోసారి కరోనా మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. నిన్నామొన్నటి దాకా స్తబ్ధతగా ఉన్న కోవిడ్ తాజాగా మళ్లీ పడగ విప్పుతోంది. అనేక రాష్ట్రాల్లో మృత్యు ఘంటికలు మోగిస్తోంది. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 22 మంది చనిపోగా.. దేశ రాజధాని ఢిల్లీలో కోవిడ్ మృతుల సంఖ్య 3కి చేరింది. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 2, 700 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రజల్లో భయాందోళనలు మొదలయ్యాయి. ప్రస్తుతం కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలో తీవ్ర నష్టం జరగడంతో వైద్య శాఖ అప్రమత్తమై.. జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రాలను అలర్ట్ చేసింది. గత వారం నుంచి ఒక్కసారిగా అమాంతంగా వెయ్యి కేసులు పెరిగిపోయాయి. ప్రస్తుతం కేరళలో 1,147 కేసులు నమోదు కాగా.. మహారాష్ట్రలో 424 కేసులు, ఢిల్లీలో 294 కేసులు, గుజరాత్‌లో 223 కేసులు, కర్ణాటక, తమిళనాడులో 148 కేసులు, పశ్చిమ బెంగాల్‌లో 116 కేసులు నమోదయ్యాయి. కేరళలోనే ఎక్కువ ఇన్ఫెక్షన్లు ఉన్నట్లు- ఆరోగ్య మరియు కుటు-ంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తాజా డేటాలో పేర్కొంది. ఇప్పటిదాకా ప్రశాంతంగా కరోనా.. మే 25 నుంచి బాగా ఎక్కువగా ప్రభావం చూపిస్తోందని తెలిపింది. వారంలోనే 5 రెట్లు- పెరిగిపోయాయని చెప్పింది. గత 24 గంటల్లో దేశ వ్యాప్తంగా ఏడు మరణాలు నమోదైనట్లు- ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 22 మంది చనిపోయినట్లు- వెల్లడించింది. గత 24 గంటల్లో మహారాష్ట్రలో రెండు మరణాలు సంభవించగా.. గుజరాత్, కర్ణాటక, పంజాబ్ మరియు తమిళనాడులో ఒక్కొక్కటి చొప్పున మరణాలు సంభవించాయి. ఇక ఢిల్లీలో తాజాగా కోవిడ్‌తో ఇద్దరు చనిపోయారు.

## చార్‌ధామ్ యాత్రకు భారీగా భక్తుల రాక

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ ఛార్‌ధామ్ యాత్రకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. చార్‌ధామ్, దేశవ్యాప్తంగానే కాకుండా విదేశీ భక్తులు ఏటా ఎంతో ఆసక్తిగా తరలివస్తుంటారు. ఈ యాత్రను హిందువులు ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా చార్‌ధామ్ యాత్ర చేయాలనుకుంటారు. ఈ సీజన్‌లో చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి గత 30 రోజుల్లో 16 లక్షల మంది భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఈ ఏడాది కేదార్‌నాథ్ యాత్రకు రద్దీ పెరిగింది. మే 2న ఆలయ తలుపులు తెరుచుకున్నప్పటి నుంచి ఇంతవరకూ 6.5 లక్షల మంది కేదార్‌నాథ్‌ను దర్శించారు. గంగోత్రి, యమునోత్రి ధామ్‌లు అక్షయ తృతీయ పవిత్రదినాన తెరుకుకోవడంతో చార్‌ధామ్ యాత్ర అధికారికంగా ఏప్రిల్ 30న ప్రారంభమైంది. కేదార్‌నాథ్ ధామ్ మే 2న, బద్రీనాథ్ ధామ్ మే 4న తెరుచుకున్నాయి. ఈ ఆలయాలు ప్రతి

సంవత్సరం ఆరు నెలలే తెరిచి ఉంటాయి. శీతాకాలం అక్టోబర్-నవంబర్‌లో మూతపడి ఏప్రిల్-మే÷-లో తెరుస్తుంటారు. హిందువులు అత్యంత పవిత్రమైన యాత్రల్లో ఒకటిగా చార్‌ధామ్ యాత్రను హిందువులు భావిస్తుంటారు. యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌ను చుట్టిరావడాన్ని చార్‌ధామ్ యాత్ర అంటారు. క్లాక్‌వైజ్‌లో యాత్ర సాగిస్తుంటారు. యమునోత్రితో మొదలై ఆ తర్వాత గంగోత్రి, కేదార్‌నాథ్ మీదుగా సాగుతూ బద్రీనాథ్‌తో యాత్ర ముగుస్తుంది. ఏప్రిల్-మే, అక్టోబర్-నవంబర్ మధ్య భక్తులు ఈ యాత్రలను చేపడుతుంటారు.

## మిస్ వరల్డ్‌గా థాయి సుందరి

హైదరాబాద్: 72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాత విజేతగా నిలిచింది. మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని కైవసం చేసుకుంది. 107 దేశాలకు చెందిన అందాల భామలతో పోటీ- పడి సుచాత విజేతగా నిలిచింది. మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలిచిన మొదటి థాయ్‌లాండ్ దేశస్తురాలు సుచాత కావటం విశేషం. సుచాత 2003, సెప్టెంబర్ 20వ తేదీన థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో జన్మించింది. కజోన్‌కిట్సకా స్కూల్లో ప్రైమరీ, సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసింది. ప్రస్తుతం పాలిటిక్స్, ఇంటర్ నేషనల్ రిలేషన్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చేస్తోంది. 2021 నుంచి అందాల పోటీల్లో పాల్గొంటోంది. గతంలో మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ 2024 విజేతగా నిలిచింది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మిస్ వరల్డ్ 2025 పోటీలు అట్టహాసంగా జరిగాయి. అంతకుముందు ఈ పోటీల్లో టాప్-8 నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఎలిమినేట్ అయ్యారు. టాప్ 8మందిలో మార్టినిక్, బ్రెజిల్, ఇథియోపియా, నమీబియా, పోలెండ్, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్, థాయిలాండ్ నిలిచాయి. ఖండాల వారీగా టాప్ ఇద్దరి నుంచి ఒక్కరిని షార్ట్ లిస్ట్ చేశారు. నువ్వు మిస్ వరల్డ్ అయితే ఏం చేస్తావు అని అడిగిన ప్రశ్నకు 45 సెకన్లలో మెరుగైన సమాధానం ఇచ్చిన వారికి నిర్వాహకులు అవకాశం ఇస్తున్నారు.

# కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగుల "రక్తదాన శిబిరం".

## - అభినందించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.





**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 31**

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ తరపున రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రారంభించగా, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు వివిధ శాఖలకు చెందిన సుమారు 60 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. తలసేమియా పేషెంట్ల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. అన్ని దానాలలోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ఉపకరిస్తుందని గుర్తు చేశారు. హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ నెలకొల్పి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ద్వారా ప్రతీ ఏటా ఈ తరహా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండడం ముదావహమని, ఇదే స్ఫూర్తితో మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రక్తదానం చేసిన ఉద్యోగులకు రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరపున ప్రశంసా పత్రాలు అందజేశారు. రెడ్ క్రాస్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, రాజాగౌడ్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ప్రభు, అసోసియేషన్ ప్రతినిధులు మహేష్, శ్రీనివాస్, తహసీల్దార్ సత్తయ్య రెడ్డి, రెడ్ క్రాస్ బాధ్యులు బుస్స ఆంజనేయులు, తోట రాజశేఖర్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా "ట్రస్మ" జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం.

## - హాజరైన రాష్ట్ర నాయకులు కందాల పాపిరెడ్డి, ఇతర నాయకులు.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 31**

తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మ) జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం పట్టణంలోని హోటల్ అమృత గ్రాండ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్మ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కందాల పాపిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. అనిల్ కుమార్, రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ కడారి అనంత రెడ్డి, అధికార ప్రతినిధి చింతల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ట్రస్మ కామారెడ్డి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పున్న రాజేష్, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా వీరాచారి, ఉపాధ్యక్షుడుగా కె . మారుతి, సహాయ కార్యదర్శులుగా సి హెచ్. గోవర్ధన్ రెడ్డి, జగదీష్ తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ట్రస్మ నూతన జిల్లా కమిటీకి రాష్ట్ర స్థాయి నాయకులు అభినందనలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్కిడ్స్ హై స్కూల్ చైర్మన్, ప్రిన్సిపాల్ సి హెచ్. గోవర్ధన్ రెడ్డి తో పాటు జిల్లాలోని వివిధ ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు పాల్గొన్నారు.

# ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు "అటానమస్" హోదా.

## 30 ఏళ్ల కృషికి దక్కిన గౌరవం.

## ఆనందం వ్యక్తం చేసిన విద్యా సంస్థ చైర్మన్ మారయ్య గౌడ్.






**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 31:**

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న ప్రముఖ విద్యా సంస్థ ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు 2025–26 విద్యా సంవత్సరం నుండి నూతనంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), న్యూ ఢిల్లీ వారు స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదాను కల్పించారు. ఈ గుర్తింపు ద్వారా కళాశాల విద్యా ప్రాముఖ్యత, సృజనాత్మకత, సమగ్ర విద్యా అభివృద్ధి దిశగా సాగుతున్న ప్రయాణంలో ఓ కీలక మైలురాయిగా నిలిచింది. స్వయం ప్రతిపత్తిలో, కళాశాలకు స్వంత పాఠ్య ప్రణాళిక రూపొందించుకోవడం, కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం, అధునిక విద్యా అవసరాలు, పరిశ్రమ అవసరాలను ప్రతిబింబించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడం స్వయంగా కళాశాల పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విదానాలను స్వేచ్ఛగా అమలు చేసే అవకాశం లభిస్తుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డా.ఎం. మారయ్య గౌడ్ మాట్లాడుతూ, "స్వయం ప్రతిపత్తి హోదా తమ గత 33 ఏళ్ల నిరంతర కృషికి గౌరవ సూచకమే కాక, భవిష్యత్తుకు సంబంధించిన బాధ్యతను సూచిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులలో మెరుగైన నైపుణ్యా కల్పిచడం, జ్ఞానం కల్పించే దిశగా వినియోగించుకుంటాం" అని పేర్కొన్నారు. ఈ హోదా కళాశాల స్థిరమైన విద్యా ప్రదర్శన, అధిక నాక్ రేటింగ్ (స్కోరు), పరిపాలన, అధ్యాపక అభివృద్ధిలో నిరూపితమైన ట్రాక్ రికార్డు ఆధారంగా లభించిందనీ వివరించారు. ఇంతటి హోదా దక్కడానికి కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మరియు పూర్వ విద్యార్థులు యూజీసీ, తెలంగాణ విశ్వ విద్యాలయం అధికారులకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# భూ భారతి పారదర్శకంగా చేపట్టాలి.




## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 31:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూ భారతి కార్యక్రమాన్ని చట్ట ప్రకారంగా, పారదర్శకంగా, సానుకూలంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ లు, సీనియర్ అసిస్టెంట్లు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు తో భూ భారతి చట్టం ప్రకారంగా భూ సమస్యలు పరిష్కరించడానికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద మన జిల్లాలోని లింగంపేట్ మండలంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. వచ్చే జూన్ 3 నుండి 20 వ తేదీ వరకు అన్ని మండలాల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి సదస్సుల నిర్వహణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఒకరోజు ముందుగానే దరఖాస్తు ఫారాలను గ్రామాల్లో పంపిణీ చేయాలని తెలిపారు. సానుకూల పద్ధతిలో దరఖాస్తులను పరిశీలించాలని, క్షేత్ర పర్యటనలు చేయాలని అన్నారు. అంతకు ముందు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టం పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, కామారెడ్డి ఆర్డీఓ వీణ, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖబ్జాలు తొలగించి, ట్రాఫిక్ నియాత్రించాలి.

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 31:**

నగరంలో ఫుట్ పాత్ ఖబ్జాలు తొలగించి, ట్రాఫిక్ నియాత్రించాలనీ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. జిల్లా పోలీస్ కమీషనర్ సాయి చైతన్య, నగర మున్సిపల్ కమీషనర్ దిలీప్ కుమార్, ఇతర ఉన్నత అధికారులతో ఎమ్మెల్యే శనివారం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతు, రాష్ట్రంలో అత్యంత పెద్ద నగరాలలో ఒకటైన ఇందూర్ నగర అభివృద్ధి, సుందరికరణకు అందరం సమిష్టి కృషితో ముందుకు పోవాలన్నారు. నగరంలో జనాభా పెరుగుతున్న క్రమంలో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యను ఎదురుకుంటున్నారని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఫుట్ పాత్ ఖాబ్జాలు, సిగ్నల్ పాయింట్స్, వన్ వే రోడ్, పార్కింగ్ విషయాలలో కఠిన నిర్ణయాలు తీసుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలేత్తకుండా చూసుకోవాలన్నారు.జిల్లాలో డ్రగ్స్, గంజాయి మహమ్మారి విచ్చలవిడిగా సరఫరా జరుగుతుందని వందల మంది యువత తమ బంగారు భవిష్యత్తు మత్తులో చిత్తూ చేసుకుంటున్నరని అన్నారు. గంజాయి, డ్రగ్స్ మారకద్రవ్యలు సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని ఉక్కుపాదం మోపాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల క్యాంపస్ లో మారకద్రవ్యలపై విద్యార్థులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.నగరంలో గ్యాంగ్ వార్ లతో ప్రజలను భయభ్రాంతులకు

గురి చేస్తున్న అల్లరి మూకలను ఉపేక్షించేది లేదు అన్నారు లా అండ్ ఆర్డర్ అదుపు చేయడంలో పోలీస్ శాఖ కఠినంగా వ్యవహారించాలని అన్నారు. అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా దుకాణాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటు గత కొద్ది రోజుల నుండి నిర్ణీత సమయానికి మూసివేయడంలో విజయం సాధించిన పోలీస్ శాఖను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ శివారులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్..

హైదరాబాద్: వేగంగా విస్తరిస్తుండటంతో.. తెలంగాణ ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా కోహెడ వద్ద దేశంలోనే నంబర్‌వన్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.కోల్డ్ స్టోరేజ్‌లు, ఆధునిక షెడ్లు, సోలార్ రూఫ్ టాప్‌లతో రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తారు.

హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడుతూ.. వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అందుకు తగిన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. నగర జనాభా, వాహనాల రద్దీ పెరుగుదలకు అనుగుణంగా రోడ్లు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి కీలక రంగాల్లో పనులు వేగవంతం చేస్తోంది. ఇక నగర ప్రజల అవసరాలు తీర్చేందుకు మార్కెట్లు కూడా సిద్ధం చేస్తుంది.

దేశంలోనే నంబర్‌వన్ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కోహెడ వద్ద నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సెక్రటేరియెట్లో కోహెడ మార్కెట్ అంశంపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. కోహెడ మార్కెట్‌ను దేశంలోనే రోల్ మోడల్ మార్కెట్‌గా నిర్మిం చాలని సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని సీఎస్ వెల్ల డించారు. ఇది ప్రభుత్వానికి ఒక 'డ్రీమ్ ప్రాజెక్టు' అని అన్నారు.

కోహెడ మార్కెట్‌ను 250 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో నిర్మించనున్నారు. ఇందులో కోల్డ్ స్టోరేజ్‌లు (శీతల గిడ్డంగులు), విశాలమైన షెడ్లు, వెడల్పైన రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఉంటాయని సీఎస్ సూచించారు. తెలంగాణలో విస్తారంగా పండే మామిడి, బత్తాయి, పండ్లు, కూరగాయలు వంటి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచేలా, రైతులు, వినియోగదారులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయం కల్పించడం ఈ మార్కెట్ ప్రధాన లక్ష్యమన్నారు. కోహెడ మార్కెట్ ఏర్పాటుకు రూ.2890 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు సీఎస్‌కు తెలిపారు. భూ సేకరణ, రోడ్లు, ఆధునిక షెడ్లు, సోలార్ రూఫ్ టాప్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లతో పాటు ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఈ నిధులు అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిషనర్, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ సురేంద్ర మోహన్, అదనపు డైరెక్టర్ లక్ష్మీ బాయి, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా రైతులు, వినియోగదారులకు గణనీయమైన ప్రయోజనాలను చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు.

# భారత నారి శక్తికి నిదర్శనం అహల్య భాయి.

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్ మే 31:**

అహల్య భాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి అధ్యక్షతన గోల్ హనుమాన్ చౌరస్తా నుండి మార్కండేయ మందిరం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్య నారాయణ మాట్లాడుతు, లోక మాత మహారాణి అహల్యాబాయి హోల్కర్ మహిళా నారి శక్తికి నిదర్శనంగా నిలుస్తూ మహిళా సాధికారాతకు ఎనలేని కృషి చేసారన్నారు. ఆమె హిందూ దేవాలయాల నిర్మాణానికి గొప్ప మార్గదర్శకురాలు నిర్మాణకర్త అన్నారు. అహల్య భాయ్ భారతదేశం అంతటా వందలాది దేవాలయాలతో పాటు ద్వారక నుంచి మొదలుకొని వారణాసి, ఉజ్జయిని, నాసిక్, గయ, వైద్యనాథ్ ఆలయం (మహారాష్ట్ర) వంటి ప్రాంతాల్లో ధర్మశాలలు నిర్మాణం చేశారన్నారు.1780లో ప్రసిద్ధ కాశీ విశ్వనాథ ఆలయ పునరుద్ధరణ, మరమ్మత్తుకు ఆమె కృషి చేసారన్నారు.



వేగుచుక్క



# ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది..

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గద్దర్ అవార్డుల్ని ప్రకటించారు. రాష్ట్రం ఏర్పడి 14 ఏళ్లు అయినా సినీ పరిశ్రమకు అవార్డుల్ని ప్రకటించలేదు. దీంతో ఈ పద్నాలుగేళ్లలో వచ్చిన చిత్రాలన్నింటికీ అవార్డుల్ని ఇచ్చారు. గత ఏడాదిలో రిలీజ్ అయిన అన్ని చిత్రాలకు అన్ని కేటగిరీల్లో అవార్డులు ఇస్తే.. గత పదేళ్లలో వచ్చిన చిత్రాల్లోంచి ఉత్తమ చిత్రాల్ని మాత్రమే ఎంచుకున్నారు. ఇక విజయ్ దేవరకొండకు మాత్రం కాంతారావు మెమోరియల్ అవార్డుని ఇచ్చారు.

విజయ్ దేవరకొండ తాజాగా తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపాడు. తనకు కాంతారావు మెమోరియల్ అవార్డుని ఇవ్వడం, తన పెళ్లి చూపులు సినిమాను ఉత్తమ చిత్రంగా ప్రకటించడంపై సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ అవార్డు రావడంతో ఎంతో గర్వకారణమని అన్నారు. నట ప్రపూర్ణ కాంతారావు పేరు మీద తనకు అవార్డు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని సోషల్ మీడియా వేదికగా స్పందించాడు.

ఈ మేరకు విజయ్ దేవరకొండ ట్వీట్ వేశాడు. 2016 ఏడాదికి గానూ పెళ్లి చూపులు సినిమాకు ఉత్తమ చిత్రంగా అవార్డును ప్రకటించారు.. ఆ సినిమా నాకు ఎప్పుడూ ప్రత్యేకం.. నా మనసులో ఎప్పటికీ నిలిచి ఉంటుంది.. ఈ అవార్డులు నా అభిమానులకు అంకితం.. వారి ప్రేమే నాకు ఇందనం.. అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

ఈ పదేళ్లలో టాలీవుడ్‌లో వచ్చిన మంచి చిత్రాలకు గద్దర్ అవార్డుల్ని ప్రకటించారు. 2016లో వచ్చిన చిత్రాల్లోంచి శతమానం భవతి, పెళ్లి చూపులు, జనతా గ్యారేజ్ సినిమాలకు ఉత్తమ చిత్రంగా అవార్డును ప్రకటించారు. వీటితో పాటు కొంత మంది ప్రముఖులకు ప్రత్యేక అవార్డుల్ని అందించారు. బాలయ్యకి ఎన్టీఆర్ నేషనల్ అవార్డు, మణిరత్నంకు పైడి జయరాజ్, సుకుమార్‌కు బిఎన్ రెడ్డి, నాగిరెడ్డి చక్రపాణి అవార్డుని పూర్ణ చంద్రరావుకి ప్రకటించారు. ఇందులో భాగంగానే కాంతా రావు అవార్డుని విజయ్ దేవరకొండకు ప్రకటించారు.

ఈ గద్దర్ అవార్డుల్లో అందరికీ సమన్యాయం చేసినట్టుగా అనిపిస్తుంది. పెద్ద సినిమాలకు మాత్రమే కాకుండా చిన్న చిత్రాలకు సైతం అవార్డులు ఇచ్చారు. 35 చిన్న కథ కాదు, రాజు యాదవ్, కమిటీ కుర్రోళ్లు, మెర్సీ కిల్లింగ్ వంటి చిత్రాలకు సైతం అవార్డుల్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ఈ పదేళ్లలో వచ్చిన ది బెస్ట్ చిత్రాల్లోంచి ఏడాదికి మూడు చొప్పున ఉత్తమ సినిమాల్ని ఎంచుకున్నారు.

విజయ్ దేవరకొండ అయితే తనకు ఇలా కాంతా రావు అవార్డుని ఇవ్వడంతో గాల్లో తేలిపోతోన్నాడు. యంగ్ యాక్టర్స్, హీరోలకి ఇలాంటి అవార్డులు వస్తే ఎంతో ప్రోత్సాహకంగా ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఇక విజయ్ ఇప్పుడు కింగ్డమ్ మూవీ ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నాడు. జూన్‌లో కింగ్డమ్ హడావిడి అయిన తరువాత మెల్లిగా రౌడీ జనార్ధన సినిమాను సెట్స్ మీదకు తీసుకెళ్లేలా కనిపిస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్ తరువాత రాహుల్ సంకృత్యాన్ సినిమా ఎలాగూ రెడీగా ఉన్న సంగతి తెలిసిందే.



# సారీ మాత్రం చెప్పను

కమల్ హాసన్ కొత్త సినిమా 'థగ్ లైఫ్' విడుదల వేళ కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కన్నడ సంఘాలు క్షమాపణ కోరుతూ ఆందోళనలు చేస్తున్నారు. సినిమాను బ్యాన్ చేస్తామని హెచ్చరించడంతో వివాదం మరింత ముదిరింది. కమల్ మాత్రం తాను తప్పు చేస్తేనే క్షమాపణ చెబుతానంటున్నారు. ఈ వివాదం ఎక్కడి వరకు వెళ్తుందో చూడాలి. కమల్ హాసన్ తన వైఖరిని మార్చుకుంటారా లేదా కన్నడిగులు శాంతిస్తారా అనేది వేచి చూడాలి.

'థగ్ లైఫ్' రిలీజ్ వేళ సీనియర్ హీరో కమల్ హాసన్ అనుకోని విధంగా ఓ వివాదంలో చిక్కుకున్నారు. కన్నడ భాషను ఉద్దేశించి ఆయన చేసిన కామెంట్స్ ఇప్పుడు పెద్ద దుమారం రేపుతున్నాయి. కర్ణాటకలో కమల్ వ్యాఖ్యలపై నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. క్షమాపణలు చెప్పాలంటూ కన్నడ భాషాభిమానులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. తన కామెంట్స్ పై ఇప్పటికే కమల్ వివరణ ఇచ్చారు. అయినా సరే కన్నడిగులు శాంతించడం లేదు. సారీ చెప్పాల్సిందేనంటూ తెగేసి చెప్తున్నారు. లేదంటే బ్యాన్ చేస్తామంటూ వార్నింగ్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కమల్ చేసిన కామెంట్స్ హాట్ టాపిక్ గా మారాయి.

కన్నడ భాషపై కమల్ హాసన్ చేసిన కామెంట్స్ విషయంలో క్షమాపణలు చెప్పకపోతే.. ఆయన నటించిన 'థగ్ లైఫ్' సినిమాని రాష్ట్రంలో బ్యాన్ చేస్తామంటూ కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హెచ్చరించింది. ఇదే విషయాన్ని లేటెస్ట్ ఇంటర్వ్యూలో కమల్ వద్ద ప్రస్తావించగా.. తాను తప్పు చేస్తేనే సారీ చెబుతానని అన్నారు. "మనది ప్రజాస్వామ్య దేశం. నేను చట్టాన్ని, న్యాయాన్ని నమ్ముతాను. వాటిని గౌరవిస్తాను. కర్ణాటక పట్ల నాది నిజమైన ప్రేమ. ఆంధ్రా, కేరళ విషయంలోనూ అంతే. ఏదైనా అజెండాతో వచ్చేవారు తప్ప, ఎవరూ నన్ను అనుమానించరు. నాకు ఇంతకు ముందు కూడా ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. నేను తప్పు చేస్తేనే క్షమాపణలు చెబుతాను. లేదంటే చెప్పను. అది నా లైఫ్ స్టైల్. దయచేసి దానిని లాగకండి" అని కమల్ అన్నారు.

'థగ్ లైఫ్' ఈవెంట్‌లో కమల్ హాసన్ మాట్లాడుతూ.. కన్నడ భాష కూడా తమిళం నుంచే పుట్టిందని అన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. కమల్ పై కర్ణాటక అధికార, విపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేసారు. సీఎం సిద్ధరామయ్య దగ్గర నుంచి కిందిస్థాయి నాయకుల వరకూ అందరూ విరుచుకుపడ్డారు. కమల్ హాసన్ కన్నడ భాషను కించపరిచేలా మాట్లాడారంటూ బెంగళూరులోని పలు పోలీస్‌స్టేషన్‌లో కర్ణాటక రక్షణ వేదిక సభ్యులు ఫిర్యాదు చేశారు. మే 30వ తేదీలోగా కమల్ క్షమాపణ చెప్పకుంటే, ఆయన 'థగ్ లైఫ్' సినిమాని బ్యాన్ చేస్తామని కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ స్పందించింది.

కమల్ హాసన్ ఇప్పటికే తన కామెంట్స్ పై రియాక్ట్ అయ్యారు. ప్రేమతోనే అలా మాట్లాడానని, ప్రేమ ఎన్నడూ సారీ చెప్పదని అన్నారు. భాష చరిత్ర గురించి ఎందరో చరిత్రకారులతో మాట్లాడానని, తన కామెంట్స్ లో దురుద్దేశం లేదన్నారు. అయితే భాష గురించి మాట్లాడే అర్హత రాజకీయ నాయకులకు లేదని, ఇది తనకు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు మరోసారి కన్నడ వివాదంపై స్పందిస్తూ.. ఏ విషయంలోనైనా తప్పు చేస్తేనే సారీ చెబుతానని స్పష్టం చేసారు. తాను తప్పు చేయలేదని, సారీ చెప్పనని చెప్పకనే చెబుతున్నారు. మరి ఈ వివాదం ఎక్కడిదాకా వెళ్తుందో? కన్నడలో 'థగ్ లైఫ్' పరిస్థితి ఎలా ఉంటుందో? వేచి చూడాలి.



# వామ్మో ఇదేం లుక్...

తాజాగా వైరల్ అయిన ఓ వీడియోలో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా లావుగా కనిపించడంతో నెటిజన్లు షాక్‌కు గురవుతున్నారు. బాగా లావు అయ్యిందన్న విమర్శలతోపాటు, మేకోవర్ అవసరమని కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అభిమానులు మాత్రం బాడీ షేమింగ్ సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు. ఈ లుక్ ఆమె చేసే ప్రాజెక్టులపై ప్రభావం చూపుతుందా? అనేది ఆసక్తికరంగా మారింది. అయితే తమన్నా ఏదైనా ప్రాజెక్టు కోసం అలా మారిందా లేక మామూలుగానే లావెక్కిందా..

బాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అన్న తేడా లేకుండా అన్ని భాషల్లోనూ హీరోయిన్‌గా అదరగొట్టింది మిల్కీ బ్యూటీ తమన్నా. ఇటీవలే తెలుగులో 'ఓదెల 2'లో కీలక పాత్రలో నటించిన ఆమె ఆ చిత్రం పరాజయం పాలైన తాను మాత్రం నటిగా మరో మెట్టు పైకెక్కింది. ఇక బాలీవుడ్‌లో హీరోయిన్‌గా కంటే ఐటెమ్ గర్ల్‌గానే ఎక్కువ ఇమేజ్ తెచ్చుకుంది తమన్నా. 'స్త్రీ 2'లో చేసిన ఐటెమ్ సాంగ్లో తమన్నా అందచందాలకు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ఇటీవల అజయ్ దేవ్‌గణ్ 'రైడ్ 2'లోనూ ఐటెమ్ సాంగ్‌తో మెరిసింది ఈ బ్యూటీ. ఇక '%బర్% 2' వెబ్ సిరీస్‌లో హాట్ సీన్లలో రెచ్చిపోయి నటించి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో ప్రేమయాణం, డేటింగ్ వార్తలతో తమన్నా పేరు మార్మోగిపోయింది. కొన్నాళ్ల పాటు ఈ ప్రేమపక్షులు బాగానే ఎంజాయ్ చేయగా ఏం జరిగిందో తెలియదు గానీ ప్రస్తుతం వేరుగా ఉంటున్నారు. ఒకరిపై ఒకరు బహిరంగంగా ఆరోపణలు చేసుకోకపోయినా బ్రేకప్‌పై నర్మగర్భంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తమన్నా లుక్‌కి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అవుతోంది. పాలఛాయ లాంటి శరీరంతో సన్నని నడుముతో చూడచక్కనైన రూపంతో పాలరాతి శిల్పంగా ఉంటే తమన్నా ఈ వీడియో బాగా లావుగా గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. అసలు తాము చూస్తుంది తమన్నానేనా అని కొందరు నెటిజన్లు ఆశ్చర్యంతో కామెంట్లు చేస్తున్నారు. ఆమె మా తమన్నా కాదు, మిల్కీ బ్యూటీ ఇలా మారిపో యిందేంటి, తమన్నాని ఇలా చూస్తానని ఎప్పుడూ అనుకోలేదు.. అంటూ నెటిజన్లు తమ రియాక్షన్ తెలియజేస్తున్నారు. కొంతమంది అయితే తమన్నా లుక్‌తో కాదు టాలెంట్‌తో ఎదిగింది. మేకోవర్ కావడం ఆమెకు చాలా చిన్న విషయం అంటూ సపోర్ట్ చేస్తున్నారు. తమన్నాపై కొందరు పనిగట్టుకుని బాడీ షేమింగ్‌కి పాల్పడుతున్నారని మండిపడుతున్నారు.



# ఓ రేంజ్‌లో ఇచ్చిపడేసిన రకుల్‌ప్రీత్

ప్రపంచ వ్యాప్తంగా భారీ ఫాలోయింగ్ కలిగిన క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లి బాలీవుడ్ నటి అవ్నీత్ కౌర్ ఫ్యాన్ పేజీకి లైక్ కొట్టిన ఘటన కొద్దిరోజుల పాటు సోషల్‌మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఈ లైక్ వల్ల అవ్నీత్ ఇన్‌స్టాలో 2 మిలియన్ల ఫాలోవర్లు పెరిగినట్లు వార్తలొచ్చాయి. ఈ ఇష్యూపై అప్పుడే కోహ్లి వివరణ ఇచ్చాడు. అయితే తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ దీనిపై స్పందిస్తూ, "ఇలాంటి ఘటనలు చూస్తుంటే మనం ఎంత ఖాళీగా ఉన్నామో అర్థమవుతోంది. సెలబ్రెటీలు చేసిన చిన్న విషయాలను కూడా పెద్దవిగా చూపించడం బాధాకరం" అంటూ నెటిజన్లపై మండిపడ్డారు.

ప్రపంచంలోనే అత్యంత భారీ ఫాలోయింగ్ ఉన్న క్రికెటర్‌గా గుర్తింపు ఉన్న విరాట్ కోహ్లి ఏది చేసినా వింతగానే ఉంటుంది. తను సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ పెట్టినా క్షణాల్లో వైరల్ అయిపోతుంది. కోహ్లి అంటే ఫ్యాన్స్‌కి అభిమానం కాదు పిచ్చి. మైదానంలోనే కాదు బయట కూడా అతడు ఏం చేసినా ఆసక్తిగానే చూస్తుంటారు. తాజా ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ ఫైనల్‌కి వెళ్లడంతో కోహ్లి అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. ఐపీఎల్ సీజన్ 18 కావడం, కోహ్లి జెర్సీ నంబర్ కూడా 18 కావడంతో ఈ సారి కప్పు మనదేనంటూ ఊగిపోతున్నారు.

అసలు విషయానికొస్తే కొద్దిరోజుల ఇన్‌స్టాలో బాలీవుడ్ బ్యూటీ అవ్‌నీత్ కౌర్ ఫ్యాన్ పేజీలోని ఓ పోస్టుకు విరాట్ కోహ్లి లైక్ కొట్టడం సోషల్‌మీడియాలో సెన్సేషనల్‌గా మారిన సంగతి తెలిసిందే. కోహ్లి లైక్ కొట్టాక ఆమె ఇన్‌స్టా పేజీకి ఏకంగా 2 మిలియన్ల ఫాలోవర్లు పెరిగారట. ఇది రచ్చకు దారి తీయడంతో క్లోహియే స్వయంగా స్పందించాల్సి వచ్చింది. ' నా ఫీడ్ క్లియర్ చేసేటప్పుడు అల్గారిథమ్ మిస్టేక్ వల్ల లైక్ పడి ఉండొచ్చు. దీని వెనుక ఎలాంటి ఉద్దేశమూ లేదు. అనవసరంగా ఊహాగానాలకు తావివ్వొద్దు.' అని కోహ్లి వివరణ ఇచ్చాడు.

ఈ ఇష్యూ అంతటితో ముగిసిపోయిందనుకుంటుండగా హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ మళ్లీ పైకి లేపింది. తాజా ఓ ప్యాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమ ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మనం చాలా ఖాళీగా ఉన్నాం' అంటూ నెటిజన్లపై విరుచుకుపడింది. 'కోహ్లి లైక్ కొట్టాక అవ్‌నీత్ కౌర్ ఇన్‌స్టా అకౌంట్‌కి 2 మిలియన ఫాలోవర్లు పెరిగారట. ఇది చాలా బాధ కలిగించే విషయం. మనం ఎంత ఖాళీగా ఉన్నామో ఇలాంటి సంఘటనల వల్ల తెలుస్తుంది. అసలు కోహ్లి కావాలని లైక్ కొట్టాడా.. పొరపాటున జరిగిందా అన్నది ఆలోచించకుండా ఆమె అకౌంట్‌ని ఫాలో అవుతూ పోయారు. ఇన్‌స్టాలో ఒక్కోసారి మనం పొరపాటున కొన్ని పోస్టులకు లైకులు కొడతాం. ఫ్రెండ్స్‌ని పొరపాటున అన్‌ఫాలో చేస్తుంటాం. ఇవన్నీ చాలా చిన్న విషయాలు. అయితే విరాట్ కోహ్లి సెలబ్రెటీ కాబట్టి ఆ చిన్న విషయాన్ని కూడా భూతద్దంలో చూసి పెద్దది చేసేశారు. జనాలు సోషల్‌మీడియా చూస్తూ సమయాన్ని ఎలా వృథా చేస్తున్నారో ఇలాంటి సంఘటన వల్ల తెలుస్తుంది' అంటూ నెటిజన్లకు చురకలు అంటించింది రకుల్ ప్రీత్ సింగ్.


# కీర్తి భట్ మెంటల్‌ది..



అయితే వీటిపై స్పందించిన నటుడు చంద్రశేఖర్ అసలు విషయాన్ని బయటపెట్టా డు. రీసెంట్‌గా చంద్రశేఖర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కీర్తి భట్ ఒక్కతే కాదని.. తన దగ్గర చాలామంది డబ్బులు తీసుకుని అబద్దాలు ఆడారని.. మనసిచ్చి చూడు సీరియల్ ద్వారా వచ్చినదానికంటే తాను అప్పులు ఇచ్చిందే ఎక్కువ అంటూ అసలు విషయాన్ని బయటపెట్టాడు. కీర్తితో మంచి బాండింగ్ ఉండేది.. రీసెంట్‌గానే ఆమెను కలిశాను. మాట్లాడాను. అయితే ఆమెను కలిసి చాలా రోజుల తరువాత కలిశాను. నా ఫోన్ నెంబర్ మారింది. నా నెంబర్ మరి ఎలా తెలుసుకుందో తెలుసుకుంది. ఫోన్ చేసి కలుద్దాం అంటే కలిశాం. నువ్వు ఇంతకుముందులా లేవు అని అన్నది. ఆమె కూడా ముందులా లేదు. ఆమె నడిచే దారి వేరైంది. ఆమె అటు పోతుంది. నేను ఇటు పోతున్నా. ఆమె తన పర్సనల్ విషయాలు నాతో షేర్ చేసుకోలేదు. నేను కూడా నా పర్సనల్ విషయాలు ఆమెతో షేర్ చేసుకోలేదు. ఒకప్పుడు అయితే నేను బాధపడ్డాను. నా కీర్తి ఎందుకు ఫోన్ చేయడం లేదు.. నేను మెసేజ్‌లు పెడుతున్నా ఎందుకు రిప్లై ఇవ్వడం లేదని అనుకునేవాడ్ని. దానికి ఫీల్ అయ్యా. ఇప్పుడు ఆ ఫీలింగ్ మొత్తం పోయింది. ఆ పిల్లకి తల్లిదండ్రులు లేరు కాబట్టి.. నన్ను నాన్న అని ఆమే ఫిక్స్ అయిపోయింది. నేను కూడా పాపం ఎవరూ లేని పిల్ల అని పెద్ద కూతురు లెక్క చూసుకున్నా. రాను రానూ.. ఆమెకి వేరే పరిచయాలు ఏర్పడటంతో మా మధ్య దూరం పెరిగింది. ఆ పిల్ల ఎంగేజ్‌మెంట్‌కి నాకు ఫోన్ చేసింది. షూటింగ్‌లో కూడా కలిసి చెప్పింది. తప్పకుండా రావాలి నాన్నా అని. నేను వస్తానని చెప్పాను. కానీ అదే రోజు నా స్కూల్ క్లాస్ మేట్స్ అంతా గెట్ టుగెదర్ ఏర్పాటు చేసి.. దావత్ పెట్టారు. దావత్ అంటే ఎలా ఉంటుందో తెలుసు కదా.. ఫుల్ అయిపోయాను. ఆ దావత్ అయిన రోజు కీర్తి ఎంగేజ్‌మెంట్. అటు నుంచి అటు పోదాం అంటే ఫుల్ అయిపోయాను. అలా వెళ్తే తిడుతుంది. నా మొహం చూస్తుంది.. అక్కడికి వెళ్లి అబ్సెట్ కావడం ఎందుకు అని గమ్మునుండిపోయాను.

ఆ తరువాత నాకు ఫోన్ చేయకుండా.. మా డ్రైవర్‌కి ఫోన్ చేసి 'నాన్న వచ్చినందుకు థాంక్స్ చెప్పండి.. నాన్నగారికీ' అని అన్నది. ఆ తరువాత నేను తిరిగి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఆ తరువాత మళ్లీ మొన్న కలిసింది. ఇప్పుడు టచ్‌లోనే ఉన్నాం. ఆమె ఎవరికో ఇంటర్వ్యూ ఇస్తే.. నా దగ్గర రూ.4 లక్షల తీసుకుని మోసం చేసిందని కామెంట్ చేశారంటే.. అది ఎవరో మా వాళ్లే అయ్యి ఉంటారు. మేం తెలిసిన వాళ్లే అయ్యి ఉంటారు. అది ఎలా బయటకు వెళ్లిందంటే.. నేను ఫుల్ అయిపోయినప్పుడు నోరు తిన్నగా ఉండదు. మాటలు బయటకు వెళ్లిపోతాయి. నా బాధ డబ్బులు ఇచ్చినందుకు కాదు. అబద్ధం చెప్పినందుకు. నేను ఇప్పటికి కూడా ఇస్తాను. కీర్తి వచ్చి అవసరం అంటే మళ్లీ ఇస్తాను. ఆమెకి కష్టం వచ్చిందంటే సాయం చేస్తాను. కానీ అబద్ధం ఎందుకు చెప్పాలనేదే నా బాధ. ఆ పిల్ల ఒక్కతే కాదు. అలా చేసిన వాళ్లు చాలామంది ఉన్నారు.

# హరిహర వీరమల్లుకు ఆఫర్..



హరి హర వీరమల్లు సినిమాకు ఏపీలో టికెట్ రేట్ల పెంపు విషయంలో ఎలాంటి సమస్య ఉండదు. ఇక తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి అయితే ఈ టికెట్ రేట్ల పెంపు విషయంలో అంత సుముఖంగా లేరన్న సంగతి తెలిసిందే. సంధ్య థియేటర్ ఘటన తరువాత పరిణామాలన్నీ మారాయి. అదనపు షోలు, ఫ్యాన్స్ షోలు, బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు అనే మాట కూడా ఎత్తడం లేదన్న సంగతి తెలిసిందే. మరి ఇలాంటి టైంలో హరి హర వీరమల్లు నిర్మాత ఏఎం రత్నం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.

ఈ సినిమా 17వ శతాబ్దపు నేపథ్యంలో తెరకెక్కించాం.. ఇది సాధారణ వాణిజ్య చిత్రాలకు భిన్నంగా, భారీ స్థాయిలో రూపొందించబడిన చారిత్రక ఇతిహాసం. అందుకే టికెట్ ధరల సవరణ విషయం గురించి మాట్లాడేందుకు సీఎం గారిని కలిశాను.. గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు మాకు తమ విలువైన సమయాన్ని, మద్దతును ఇచ్చినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు అని చిత్రయూనిట్ తెలిపింది.

హరి హర వీరమల్లుకి తెలంగాణలో మంచి టికెట్ రేట్లు లభించేలా ఉన్నాయి. చూస్తుంటే గరిష్టంగా రూ. 400, కనిష్టంగా రూ. 200 ఉండేలా కనిపిస్తోంది. మొదటి వారం రోజులు మాత్రం భారీగా రేట్లు పెంచేట్టు కనిపిస్తోంది. ఒక వేళ అప్పటి వరకు అదనపు షోల మీద కూడా అనుమతులు లభిస్తే ఇక డే వన్ విషయంలో అదిరిపోయే రికార్డులు నమోదు అయ్యే అవకాశం ఉంటుంది. హరి హర వీరమల్లుని జూన్ 12న రిలీజ్ చేసేందుకు నిర్మాత అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

అసలు ఏఎం రత్నం మీద ఈ రోజు ఉదయం నుంచి ఓ వింత వార్త ప్రచారంలోకి వచ్చింది. ఏఎం రత్నం అస్వస్థతకు గురయ్యారు అనే వార్త ఒక్కసారిగా ట్రెండ్ అయింది. దీంతో సినిమా వాయిదా వేస్తారా? అసలు రత్నంకి ఏమైంది? ఇలాంటి టైంలో అలాంటి వార్త ఎందుకు వచ్చింది? అంటూ అంతా షాక్ అయ్యారు. కానీ ఇలా సీఎంతో భేటీ అయినట్టుగా ఫోటో రావడంతో అవన్నీ రూమర్లే అని అందరికీ అర్థమైంది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించింది. అనసూయ ఓ ప్రత్యేక గీతంలో మెరిసింది. కీరవాణి అందించిన మ్యూజిక్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ కానుంది. క్రిష్ మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టుని జ్యోతి కృష్ణ పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మరి మొదటి పార్ట్‌కే ఇంత టైం పడితే రెండో పార్ట్ తీస్తారా? అసలు ఉంటుందా? అన్నది చూడాలి.